# స్వేచ్ఛ

సాయంత్రం ఆరుగంటలు అవ్వబోతోంది. పడమటి ఆకాశం ఎర్రబడుతున్న వేళ... పార్కులో జనం పరవశంగా పరవళ్ళు తొక్కుతున్న వేళ. పిల్లలు కేరింతలు కొడుతూ పచ్చటి గడ్డిమీద ఆనందంగా ఆడుకుంటున్న వేళ...

"ఎక్స్క్యూజ్‌మి! మీకేమైనా కంపెనీ యివ్వగలుగుతానా నేను!"

ఓ పొద పక్కగా కూర్చున్న అతడు చటుక్కున తలెత్తాడు, ఆ తీయని కంఠం వింటూనే.

ఎదురుగ్గా అందమైన అమ్మాయి. సన్నగా పొడుగ్గా, పందిరికి పాకిన లతలా వున్నది. విశాలమైన కళ్ళు. కొన దేరిన ముక్కు. పొడువైన జడను ముందుకు వేసుకొని బుగ్గలు సొట్టలు పడేలా నోరు తెరుచుకొని నిలుచొని వున్నది.

"అంటే?" అన్నాడు విచిత్రంగా ఆ అమ్మాయినే చూస్తూ.

"మీరు వంటరిగా వున్నారు... నేనూ వంటరిగానే వున్నాను... కాసేపు కాలక్షేపం చేద్దామా అని!"

ఒక్కసారి పైనుంచి క్రిందకు ఆ అమ్మాయిని చూచాడు అతడు. చక్కని రూపం. ఒక చేతిని భుజానికి తగిలించివున్న వ్యానిటీ బ్యాగ్ మీద, మరోచేతిని నడుం మీద వేసుకొని వయ్యారంగా వున్నది.

వాలుగా కూర్చొని పుస్తకం చదువుకుంటున్న అతడు నిటారుగా కూర్చుంటూ, "ఓకే! కూర్చోండి!" అన్నాడు.

"గంటకు రెండు వందలవుతుంది!"

ఆ అమ్మాయి వంక సూటిగా చూచాడు అతడు.

"ఒట్టి మాటలకేనా?"

ఆ అమ్మాయి అతడి వంక యిబ్బందిగా చూచింది.

అతడు నవ్వి, "ఓకే! యిస్తాను...!" అన్నాడు.

ఆ అమ్మాయి అతడి పక్కగా ఆ పొద వెనకగా కూర్చున్నది. కూర్చుంటూ కాస్త అతడి వైపుకు వాలింది.

"మీ పేరు?"

సంశయంగా అతడి వంక చూచింది.

అతడు నవ్వాడు- "ఓకే! మీకు మీ పేరు చెప్పటం ఇష్టం వుండదు... అందంగా వున్నారు కాబట్టి మేనక అంటాను ... నా పేరు సత్ చిత్ ఆనందమూర్తి- అంటే సచ్చిదానందమూర్తి అని!"

అతడి మాటలకు ఆ అమ్మాయి విచిత్రంగా చూచింది.

"కాలక్షేపం అంటే ఎలాంటి కాలక్షేపం చేద్దామని!"

"మీకు ఇష్టంలేకపోతే చెప్పండి నేను వెళ్ళిపోతాను- నన్ను ఇబ్బందికరమైన ప్రశ్నలతో ఖంగారు పెట్టవద్దు!" నుదురు ముడివేస్తూ అన్నది మేనక.

"ఓకే!... ఓకే!... ఇలాంటివి నాకు కొత్త!" అపాలజిటిక్‌గా అన్నాడు సచ్చిదా నందమూర్తి. "మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని కాదు!"

ఆమె మోకాళ్ళ మీద తల ఆనించి అటూ యిటూ ఊపుతూ, "నాకూ కొత్తే!" అన్నది చిన్నగా.

"కొత్తే అవ్వవచ్చుగాని ఏమాత్రమూ అవగాహన లేకుండా ఇక్కడకు వచ్చి పరాయి మొగవాడిని కాలక్షేపం చేద్దామా అంటూ ఆహ్వానించరు గదా! ఓకే... సరే... మిమ్మల్ని ముట్టుకోవచ్చా?"

ఆమె భయం భయంగా తల ఊపింది.

"ముద్దులు పెట్టుకోవచ్చా?"

ఆమె ముఖం ఎర్రగా కందింది. "చెంపల వరకూ!" గొణుగుతున్నట్లుగా అన్నది తల వంచుకొని.

"ఏ విషయాలైనా మాట్లాడవచ్చా?"

"అసభ్యకరం కానివి!" ఆమె కళ్ళు మూసుకుంటూ అన్నది.

"డబ్బు సంపాదనే ముఖ్యమైనప్పుడు ఎందుకీ ఆంక్షలు?" సీరియస్‌గా అన్నాడు. "ఓకే! నేను మిమ్మల్ని మాటల్లో బెట్టి డబ్బులు ఎగగొట్టి మోసం చేయాలనేది నా అభిమతం కాదు!" అంటూనే కాస్త పక్కకు వంగి, జేబులోనుంచి పర్సు తీసి రెండు వంద రూపాయిల నోట్లు బయటకు లాగి మేనకకు యిచ్చాడు. "ఇప్పుడు ఫ్రీగా మాట్లాడుకుందాం!" అని చేతి గడియారం వంక చూస్తూ, "మీరు నా దగ్గర కూర్చొని అయిదు నిముషాలయింది... మళ్ళీ ఏడు గంటలకు మన కాలపరిమితి ముగుస్తుంది!" అన్నాడు.

మేనక చెంపలు తడవటం గమనించాడు అతడు.

"బీ ఫ్రీ!" సచ్చిదానందమూర్తి ఆమె చేతి మీద చేయివేసి నొక్కాడు. అప్పుడు ఆమె చేతి కంపనం ఆమె అబద్ధం చెప్పటంలేదని అర్థం చెప్పింది. ఆ అమ్మాయికి నిజంగానే ఇలాంటి వ్యవహారం కొత్త అయి వుండవచ్చు!

"నేను ఓ పెద్ద కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాను. నా భార్య పుట్టింటికి వెళ్ళింది... బోరు కొడుతుంటే ఇక్కడకు వచ్చాను... నా అదృష్టం అన్నట్లుగా మీరు పరిచయమయ్యారు... మీకు అభ్యంతరం లేకపోతే మా యింటికి వెళ్దాం... ఈ రోడ్డు మీదే సెకండ్ లెఫ్ట్ తిరిగితే రైట్‌సైడ్ నాలుగో ఇల్లు మాది... నడక దూరం... ఓకే! నేను మీతో మీకిష్టంలేని విధంగా ప్రవర్తించను- ప్రామిస్!"

మేనక తల అడ్డంగా వూపింది. "నాకు ఇళ్ళకు వెళ్ళడం ఇష్టం లేదు... మన్నించండి!" అన్నది రిలాక్స్‌వుతున్నట్లుగా కొద్దిగా వెనక్కు వాలి.

"ఇక్కడ మనని ఎవరైనా చూస్తే మీకు ఇబ్బందిగా వుండదా?"

"మీకున్నదా?"

"మా ఆవిడ చూస్తేనే నా కొంపలంటుకుంటయిగాని- ఆవిడ ఊళ్ళో లేదన్నాను గదా!"

"నాకు పెళ్ళికాలేదు కాబట్టి భర్తను గురించిన భయంలేదు. నాకు ఊహ తెలియకముందే మానాన్న పోయాడు... తోడబుట్టినవారు లేరు... మా అమ్మకు నా గురించి ఎవరు ఎంత చెడుగా చెప్పినా పట్టించుకోదు!" అన్నది హాయిగా నవ్వేస్తూ.

"అంటే మీరు స్వేచ్ఛగా ఎంత ఎత్తుకైనా ఎగరగలిగే గువ్వలాంటి వారన్నమాట!" నవ్వాడు సచ్చిదానందమూర్తి.

"ఒక విధంగా!"

ఆమాట అంటున్న ఆమెను చూస్తుంటే- ఆమె మరీ అమాయకురాలేం కాదు అనిపించింది అతడికి.

"మీరేం చేస్తుంటారు?"

"బియస్సీ ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాయాలి!"

"మీకు పాకెట్ మనీ ఇంట్లో ఇవ్వరా?"

మేనక మాట్లాడలేదు.

"మీ హాబీస్ ఏమిటి?" అన్నాడు ఆ అమ్మాయి ముఖంలోకే తాదాత్మ్యంగా చూస్తూ, "రోజూనా... లేక ఎప్పుడైనా వస్తుంటారా ఇలా పార్కుకు?"

ఆ అమ్మాయి రోషంగా అతడి వంక చూచింది.

"ఓకే! సారీ... నాన్న లేరన్నారు... మీకు అన్నలూ, అక్కలూ లేరు... మీ అమ్మగారు ఉద్యోగమైనా చేస్తుండాలి... లేదా మీరు మంచి స్థితిమంతులైనా అయి వుండాలి!"

"రెండూ కాదు!"

అతడు నిట్టూర్పు విడుస్తున్నట్లుగా మూలిగాడు. ఆమె పరిస్థితి అర్థమయినపుడు- ఏదో విధంగా డబ్బు సంపాదించాలి ... తల్లీ కూతుళ్ళ పొట్టలు నింపుకోవటానికే గాకుండా ఆమె చదువుకి గూడా కావాలి.

"ఓకే! కాఫీగాని... కూల్ డ్రింక్స్‌గాని త్రాగుదామా?... అంతకుమించి హాట్ డ్రింక్స్ నాకిష్టం వుండదు!" అన్నాడు ఓరగా చూస్తూ.

"కూల్ డ్రింక్స్ వరకూ నాకూ అభ్యంతరం లేదు!" అన్నది పేలవపు నవ్వుతో మేనక.

"ఇద్దరం కలిసి వెళ్ళి త్రాగటానికేం అభ్యంతరం లేదు గదా!" అన్నాడు లేచి గూడలెగరేస్తూ సచ్చిదానందమూర్తి.

అతడు తనను ఆటపట్టిస్తున్నాడని అర్థమయింది మేనకకు. మనస్సుకు కష్టమేసినా మెదలకుండా వూరుకున్నది. తనూ లేచి అతడితోపాటు ఆ పార్కు గేటు దగ్గరున్న కూల్‌డ్రింక్స్ పార్లర్ దగ్గరకు నడిచింది.

"రెండు ఐస్‌క్రీంలు తీసుకు వెళ్ళి ఆ చెట్టు క్రింద కూర్చొని తిందాం! ఓకే!" అన్నాడు అక్కడకు వెళ్ళిం తరువాత అతడు.

అంగీకారంగా తల ఊపింది మేనక. టైం చూచుకున్నాడు సచ్చిదానందమూర్తి. సరిగ్గా ఆరు గంటల నలభై అయిదు నిముషాలయింది. అంటే తనిచ్చిన డబ్బుకు ఇంకో పావుగంటే వుంటుంది తన దగ్గర మేనక!

త్వరత్వరగా రెండు కప్పులు తీసుకొని వెనక్కు వచ్చాడు. వస్తూ- లైటు స్తంభం పక్కగా చెట్టు నీడలో నిలుచున్న మేనక చేయెత్తి రెండు వేళ్ళూ 'వి' ఆకారంలో పెట్టి విజయం సాధించినట్లుగా దూరంగా వున్న మరో అమ్మాయికి సైగ చేస్తుండటం గమనించాడు. 'అంటే- వీళ్ళు చాలామంది వున్నారన్నమాట!' అనుకున్నాడు.

ఐస్‌క్రీం కప్పు ఆ అమ్మాయికి ఇస్తూ, చెట్టు క్రింద గడ్డిలో కూర్చొని, "రేపూ నాకు కంపెనీ ఇవ్వగలరా?" అన్నాడు.

"ప్రయత్నిస్తాను!"

"ప్రయత్నించడం కాదు... తప్పకుండా రావాలి... మీరు నాకు నచ్చారు... మా ఆవిడ వచ్చిందాకా రోజూ నాకు మీతో ఓ గంట కాలక్షేపం చేయాలని వున్నది... మీకు ఎన్ని ఎంగేజిమెంట్లు వున్నా కాన్సిల్ చేసుకు రావాలి... రోజుకు నేను ఐదు వందలు ఇస్తాను!"

మేనక కళ్ళు తళుక్కున మెరిసినయి.

– తను వచ్చే నెలలో అనుకున్నట్లుగా సిమ్లా వెళ్ళగలదు!

* * *

సరిగ్గా ఆరు అయ్యేటప్పటికి సచ్చిదానందమూర్తి ఆ పార్కుకు వచ్చి నిన్న కూర్చున్న పొద పక్కనే కూర్చున్నాడు- గేటు వంక ఆత్రంగా చూస్తూ.

మేనక వచ్చింది. నీలి ఆకాశంలో తెల్లటి మబ్బుల మీదనుంచి గులాబీపూలను అతడిముందు క్రుమ్మరిస్తున్నట్లుగా వచ్చింది. తెల్లటి చుడీదారు మీద గులాబీ పూల ప్రింటు. రెండు జడలేసుకున్నది. పలచటి తెల్లని చున్నీని మెడచుట్టూ చుట్టి క్రిందకు వదిలేసింది.

వస్తూనే, "హాయ్!" అన్నది.

"ఓకే... రావేమోనని భయపడ్డాను!" అన్నాడు.

"ఎందుకనుకున్నారు అలా అని?" చిరునవ్వు చిందిస్తుంటే బుగ్గల్లో సొట్టలు పడినయి.

ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు. "ఎందుకో అలా అనిపించింది... ఓకే... నా ఆలోచన తప్పు అవ్వవచ్చు... కానీ ఒక్కటి నిజం... మనిషికి కోరికలంటూ లేకపోతే దేంవుణ్ణి తలుచుకోడు... ఈ రోజున నేనిక్కడకు బయల్దేరుతూ, నువ్వు తప్పకుండా రావాలని దేంవుడికి దణ్ణం పెట్టుకున్నాను!"

"నేను రోజూ లేస్తూనే ఆ పని చేస్తాను!" కించత్ గర్వం పొడచూపింది ఆ మాటల్లో.

"పార్కులో బాగా డబ్బున్న మనుష్యులు దొరకాలనా?"

ఆమె ముఖం కందగడ్డలా అయింది అవమానంతో, ముక్కుపుటాలు అదరసాగినయి.

అది గమనించి అతడు త్వరత్వరగా అన్నాడు. "ఓకే! టేకిట్ ఈజీ! నిన్ను బాధ పెట్టాలని అలా అనలేదు... ఓ ఉదాహరణగా చెప్పాను... ప్రతిరోజూ ప్రశాంతంగా గడపాలనుకోవటం గూడా ఒక కోరికే!"

మేనక మాట్లాడలేదు. కానీ ఆమె ఓ విషయాన్ని గమనించింది. నిన్న 'మీరు' అంటూ మన్నించని అతడు ఈ రోజున 'నువ్వు' అంటున్నాడు. తన మీద గౌరవం పలచబడుతున్నదన్నమాట!

అయినా ఇలాంటి సొల్లుకబుర్లు చెప్పటానికేనా అతడు తనకు ఇంత డబ్బు ఇస్తున్నది. కారణం ఏమై వుంటుంది? అతడుగాని ఇంట్లో నరకం అనుభవించటం లేదుగదా? లేక భార్య కురూపేమో! పుట్టింటికి వెళ్ళిందీ అని చెబుతున్నాడు ... నిజంగా పుట్టింటికి వెళ్ళిందా- లేక స్వేచ్ఛగా తిరుగుతూ ఆనందాన్ని పొందుతున్నదా? అలా అనుకుందామనుకున్నా ఇతడూ డబ్బున్న అందగాడే గదా... ఏవో... ఒక కంటికి అందమైనదే మరో కంటికి అసహ్యమవ్వవచ్చు!

"ఓకే! ఓకే! ఇవ్వాళ ఏవిషయం మీద మాట్లాడుకుంటూ కాలక్షేపం చేద్దాం!" అన్నాడు ఆ అమ్మాయి మృదువైన చేతిమీద తన చేయి వేసి నిమురుతూ.

ఆమెకు నవ్వు వస్తోంది. పళ్ళ బిగువున బిగపట్టుకున్నది. ఇతడిలో ఏదో మానసిక రుగ్మత వున్నది. అతడిని ఒక ఆట పట్టించాలనుకున్నది క్షణం. కానీ ఈరోజు అయిదొందలు యిస్తానన్నాడు. ఇంకా ఇవ్వనే లేదు. తనేమైనా నోరు జారితే కోపమొచ్చి వెళ్ళిపోయాడంటే నష్టపోయేది తనే. ముభావంగా కూర్చున్నది.

"ఓకే మేనక! మనం బిజినెస్‌లోకి దిగేముందు నీ డబ్బు నీకివ్వటం నాకు భావ్యంకదా!" అంటూ పర్సు తీశాడు.

ఆమె ఉలిక్కిపడింది-అతడు తనని చదివేస్తున్నాడా అన్నట్లుగా. "ఫరవాలేదు... ఫరవాలేదు!" అన్నది తడబడుతూ.

ఆమె చేతికి డబ్బు యిస్తుండగా ధైర్యం చేసింది తను అనుకున్న ప్రశ్న వేయటానికి. "అసలు దేంవుడు వున్నాడని అంటారా?" అన్నది అంతకు ముందు వదిలేసిన విషయంలోకి తిరిగి వెళుతూ.

"ఆకాశంలో నక్షత్రాలున్నయి... రాత్రిపూట స్పష్టంగా కనబడతాయి. పగలు సూర్యుడు వస్తాడు. ఒక్క నక్షత్రమూ కనబడదు... అప్పుడు ఆకాశంలో నక్షత్రాలు లేవనా నీ ఉద్దేశ్యం?"

మెడవంచి తలను మోకాలి మీద పెట్టుకొని ఓరగా అతడి వంకే కన్నార్పకుండా చూస్తూ వుండిపోయింది మేనక.

"అలాగే- మన తెలివి తక్కువ తనం వలన దేంవుడిని చూడలేక దేంవుడు లేడు అనుకోవటం ఎంత అవివేకం?"

అతడు చదువుకున్న మహా జ్ఞాని అయినా అవ్వాలి- లేదా జీవితంలో ఘోరంగా దెబ్బతిని తన తల్లిలాగా సైకో అయినా అయి వుండాలి!

"ఓకే! మనం కనబడని దేంవుడిని గురించి మాట్లాడటం మానేద్దాం... నువ్వు ఇలా పార్కుల్లో నా లాంటి పిచ్చి వాళ్ళ దగ్గర వసూలు చేసిన డబ్బును ఏం చేద్దామని! మీ అమ్మకిస్తావా?"

మరోసారి ఉలిక్కిపడింది మేనక. ఇతడిలో తను గ్రహించలేక పోతున్న శక్తి ఏదో వున్నది. తను ఏది అనుకుంటే అదే అతడు మాట్లాడుతున్నాడు. అతడి ముందు తను సాధ్యమయినంత వరకూ అతడిని గురించిన ఎలాంటి అభిప్రాయాలు మనస్సులో ఊహించకుండా ఉండటం - మాట్లాడేటప్పుడు అతి జాగ్రత్తగా మాట్లాడటం... మంచిది అనిపించింది.

"ఓకే! చెప్పటం ఇష్టం లేదా- ఈ డబ్బు ఎలా ఖర్చు పెట్టేది?"

"రేపు సమ్మర్ వెకేషన్స్‌లో మా ఫ్రెండ్సంతా సిమ్లా వెళ్ళాలనుకుంటున్నారు... అమ్మ నడిగితే తన దగ్గర లేవన్నది ... ఆమె చాలా మొండి మనిషి.. అప్పుడు ఓ స్నేహితురాలు

సలహా యిచ్చింది... ఇలా పార్కుల్లో కాలక్షేపం చేస్తే ఎంత కావాలన్నా దొరుకుతుందని... తనకు డబ్బు అవసరమొచ్చినప్పుడు ఇలాగే చేస్తుంటుందట!" మేనక చెప్పినట్లు కొత్త అవ్వడంతో మనస్సు విప్పి నిజాల్నే సచ్చిదానందమూర్తి ముందు పరిచింది.

అతడు తృప్తిగా ఆ అమ్మాయి వంక చూచాడు. "ఐ లైక్ యూ మేనకా! నీ నిజాయితీని నేను మెచ్చుకుంటున్నాను... ఎంత కావాల్సి వస్తుంది మీ ట్రిప్పుకి?"

"కనీసం పదివేలు... ఆపైన ఎంత ఎక్కువ వుంటే అంత మంచిది... అక్కడ ప్రతిదీ ఖరీదట గదా!"

"అక్కడా ఇలాగే పార్కులుంటాయి- భయందేనికి?" సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు సచ్చిదానందమూర్తి.

అతడి మాటలు ఆమె గుండెల్లో శూలాల్లా గుచ్చుకున్నాయి. విలవిలలాడింది. ముఖం నల్లబడి వాడి వాలి పోయింది!

"ఓకే! ఓకే! లీవిట్... ఈరోజు మన గంటకు ఇంకొక్క అయిదు నిముషాలే వున్నది... రేపాలోచిద్దాం ఆ విషయం మీద!" అన్నాడు సచ్చిదానందమూర్తి మాట తప్పిస్తూ- ఆ అమ్మాయి తన మాటలకు బాధపడుతున్నదని గ్రహించి.

"రేపు నాకు రావటానికి వీలు పడదు!" అన్నది ముఖం ముడుచుకుంటూ.

"అదేం? నా మీద కోపమా?" చాలా బాధగా అన్నాడు.

"మీ మీద నాకు కోపం దేనికి? నా ఆప్త మిత్రురాలి పుట్టిన రోజు... నేను వెళ్ళకపోతే అది ఊరుకోదు!"

"ఓకే! ఎన్నింటికి వెళ్ళాలి అక్కడకు?"

"అందరినీ ఆరింటికల్లా రమ్మనమని చెప్పింది... నేనయితే అక్కడ ఏర్పాట్లు చూడటానికి ఓ అరగంట ముందే వెళ్ళాలి!"

"వద్దు మేనకా!" ఆమె చేతిని బలంగా నొక్కుతూ అన్నాడు. "నాకెందుకో రేపు నీకు రెండువేలు యివ్వాలనిపిస్తోంది ... ఆరూ, ఏడు మధ్య నువ్వు ఎట్టి పరిస్థితులలోనూ ఇక్కడ వుండాలి... సారీ! ఆ సమయంలో నిన్ను చూడకపోతే నా మనస్సంతా శూన్యమయి నేను బాధపడతాను... రెండు రోజుల్లోనే నన్ను నువ్వు పూర్తిగా లొంగ దీసుకున్నావు!"

అతడి మాటలకు మేనక శిలాప్రతిమే అయింది. గంటకు రెండు వేలా? అతడు పిచ్చివాడే- అనుమానం లేదు!

- ఆమె గుండె దడదడలాడసాగింది!

* * *

సాయంత్రం ఆరు గంటలకు ఇంకా అయిదు నిముషాలుండనగా సచ్చిదానందమూర్తి పార్కుకు వచ్చి తను రోజూ కూర్చుండే పొద దగ్గర కూర్చున్నాడు. ఈరోజు మేనక వస్తుందా? రాదా? చాలా ఆత్రంగా వున్నది అతడి మనస్సు. టైం గడుస్తున్న కొద్దీ ఆతురుత పెరిగిపోతోంది. సరిగ్గా ఆరు గంటలప్పుడు గేటు వంకే చూస్తున్న అతడి కళ్ళు కాంతివంత మయినయి.

మేనక లోపలకువస్తోంది. దివినుండి భువికి దిగి వస్తున్న దేవతలా- పూర్తిగా తెల్లని చీరలో... హిమాలయాలల్లో నుంచి ఉరవళ్ళు పరవళ్ళతో దూకుతున్న నీటి ప్రవాహంలా...

వచ్చి ముభావంగా కూర్చున్నది.

"మీ స్నేహితురాలు బాగా తిట్టిందన్నమాట!"

ఊహ తెలిసీ తెలియని పిల్లలా అమాయకంగా - అవునన్నట్లుగా తలను పైకీ క్రిందకూ ఊపింది మేనక.

"ఏం చెప్పావ్?"

"సిమ్లా టూర్ సంగతి గుర్తు చేశాను... వెళ్ళకపోతే నేను రెండు వేలు నష్టపోతానని చెప్పాను... దాని సలహా మీదే నేను పార్కుకు వస్తుండటంతో అది కాదనలేకపోయింది!"

బాధగా చూచాడు సచ్చిదానందమూర్తి ఆ అమ్మాయి వంక.

"బేబీ!" అన్నాడు ఆప్యాయంగా. "నీ మనస్సు కష్టపెట్టాను గదూ!"

మేనక అతడి వంక విచిత్రంగా చూచింది. ఆపైన నిన్న 'నువ్వు'లో నుంచి ఈ రోజు 'బేబీ' లోకి మారటం గుర్తించింది. రేపు 'ఒసేయ్' అంటాడేమో!

"మనం సాయంత్రంపూట కలిసే ఈ క్షణాలకు ముగింపు వచ్చేస్తోంది... ఎల్లుండి ఉదయాన నా భార్య ఊరునుంచి వస్తున్నట్లుగా రాత్రి ఫోను చేసి చెప్పింది!"

దిగులుగా అతడి వంక చూచింది మేనక. దూరంగా కూర్చొని, ఏవో పిచ్చిపిచ్చి కబుర్లు చెప్పి ఎక్కువ డబ్బులిచ్చే అతడి వలన తన ఆశ పూర్తిగా నెరవేరదన్నమాట!

"నీ సిమ్లా ప్రయాణం ఇబ్బందుల్లో పడుతుందా? ఓకే... ఓకే... రేపు ఎలాగూ కలుస్తాం గదా... ఆఖరి రోజు కాబట్టి-మరిచిపోయాను- ముందు ఈరోజు డబ్బులివ్వనీ!" అంటూ పైజేబులోనే పెట్టుకున్న నాలుగు అయిదు వందల రూపాయిల నోట్లు తీసి ఆమె కిచ్చాడు. "రేపు ఆఖరిరోజు అన్నానుగదా... ఇప్పటివరకూ నీకు రెండు వేల ఏడువందలు ఇచ్చాను... ఇంకో ఏడు వేల మూడు వందలు రేపు సాయంత్రం ఇస్తాను... అయితే ఆరునుంచి ఏడుదాకా రేపు ఇక్కడ కూర్చున్న తరువాత మనం ఒకచోటకి వెళ్ళాలి!"

అతడివంక భయంగా చూచింది. అనుమానంగా చూచింది. ఆశ్చర్యంగా చూచింది. వింతగా చూచింది. ఊరికినే మాటలు చెప్పి నాలుగు రోజుల్లోనే ఇన్నివేలు యిస్తున్నాడూ అంటే- అవి దొంగనోట్లు కాదు గదా! ఆ పైన రేపు తనను ఎక్కడికి తీసుకు వెళతాడో... ఊహించలేకపోయింది భయంతో.

అతడు పకపకా నవ్వాడు.

"నీ మొహం చూస్తుంటే నాకేమనిపిస్తున్నదంటే- నేనిచ్చేవి ఫేక్ కరెన్సీ ఏమోనని అనుమానపడుతున్నావు కదూ! ... కాదు బేబీ... తండ్రి ఎప్పుడూ కూతుర్ని మోసం చేయడు!" అన్నాడు చాలా సీరియస్‌గా ముఖం పెట్టి.

తను ఆయన కూతురా? ఉలిక్కిపడ్డట్లుగా అతడి వంక చూచింది. అంతేకాదు- డబ్బు విషయంలోనూ తన మనస్సులో మెదిలిన ఊహనే వ్యక్తపరిచాడంటే- తల విదిలించింది- తనని తాను కంట్రోల్ చేసుకోలేకపోతున్నది- అతడి వయస్సు ముప్ఫయికి మించి వుండదు. తనకు మరో సంవత్సరంలో యిరవై రాబోతున్నాయి- తను అతడికి కూతురు ఎలా అవుతుంది?

మేనకకు అతడి వింత ప్రవర్తనకు అతడి మాటల్లోనే క్లూ దొరికింది- అతడి కూతురు చనిపోయింది- ఆ అమ్మాయి పోలికలు తన ముఖంలో కనబడుతుండడంతో అతడు తనను ఆప్యాయంగా చూస్తూ అంత డబ్బిస్తున్నాడు- కూతురు పోయిన షాక్‌లో అతడికి మతిస్థిమితం తప్పి వుండాలి!

"నేను చాలా ప్రిన్స్‌పుల్డ్ మనిషిని. నిబద్ధతతో పెరిగినవాడిని... క్రమశిక్షణకు ప్రాణం ఇస్తాను... సమయపాలన అంటే నాకు ఎంతో ఇష్టం... అందుకే నిన్ను ఆరు అంటే- ఆరుకే ఇక్కడ వుండమంటాను... నువ్వెప్పుడైనా ఈ విషయాల పైన దృష్టి వుంచావా?"

"మీరు ఎప్పుడైనా ఏ విషయంలోనైనా షాక్ తిన్నారా?" అతడి వంకే జాలిగా చూస్తూ అన్నది- అతడి ప్రశ్నను పట్టించుకోనట్లుగా.

"నన్ను ఎంత షాకైనా ఏమీ చేయలేదు... నా మనస్సు అంత దృఢమైనది!"

"నేను అడిగిందానికి సమాధానం చెప్పండి!" కాస్త గొంతు హెచ్చించి మేనక అడిగింది.

"ఓకే... ఓకే! షాక్ తినని మనిషిని నువ్వెప్పుడైనా చూచావా... చనిపోయిన తన పిల్లవాడిని బ్రతికించమని ఏడుస్తూ వచ్చిన ఓ తల్లికి బుద్ధభగవానుడు ఏం చెప్పాడో తెలుసా... చావు అంటే ఎరగని కుటుంబం నుంచి కాసిని ఆవాలు పట్టుకు రమ్మనమన్నాడు. ఆ తల్లికి అలాంటి గృహం కనబడక ఆత్మజ్ఞానంతో తనని తాను సముదాయించు కుంటుంది. దుఃఖాన్ని మరిచి పరిస్థితికి తల ఒగ్గుతుంది!"

మేనక నిట్టూర్పు విడిచింది. తన ఊహ నిజమే. అతడి ఆత్మీయులెవరో మరణించారు. ఆ చనిపోయిన వారి పోలికలు తనలో వున్నాయి. అందుకే తనని చూడటానికి తహతహలాడుతున్నాడు.

"నువ్వొక్క పనిచేయి జేబీ! అమ్మకు నువ్విలా పార్కుల వెంట తిరుగున్నావని తెలిసినా ఇబ్బంది లేదంటివి గదా! కనుక ఆమెకు ఈ విషయాన్ని చెప్పు... ఆమె స్పందన ఏమిటో నువ్వు నాకు చెప్పాలి!"

"మా అమ్మ మీకు తెలుసా?" ఆత్రంగా అడిగింది.

సచ్చిదానందమూర్తి పకపకా నవ్వాడు. "మీ అమ్మ అందరికీ తెలియాల్సినంత గొప్ప మనిషా?" అన్నాడు ఎగతాళిగా.

మేనక కుదించుకుపోయింది అతడి మాటలకు.

పార్కంతా దీపాల కాంతిలో పచ్చబారి పోయింది. ఫౌంటెన్ విరజిమ్ముతున్న నీటి తుంపరలు గాలిని తడిపేస్తున్నాయ్. దూరంగా గుడి గంటల శబ్దం వినబడుతోంది.

"రేపు ఎక్కడికి వెళ్ళాలన్నారు?" భయం భయంగా అతడి ముఖంలోకి చూస్తూ అన్నది.

"రేపు సాయంత్రం గదా... అప్పుడు నిర్ణయిద్దాం!"

మేనక బిగుసుకుపోయి అతడి వంకే చూస్తున్నది. అతడి కళ్ళు ఆ తెల్లటి దీపాల కాంతిలో గాజు గోలీల్లా చిన్నవిగా లోతుకు పోయినట్లుగా కనిపించగా మేను కంపించింది.

పార్కు మధ్యలో వున్న స్తంభం మీద వున్న పెద్ద గడియారం గంటలు కొట్టటం మొదలు పెట్టింది.

ఉలిక్కిపడి తలెత్తింది మేనక. సరిగ్గా ఏడుగంటలయింది!

– అతడు సమయం అయిపోయినట్లుగా లేచి నిలుచుంటున్నాడు!

* * *

సచ్చిదానందమూర్తితో అనుభవం చాలా ఎక్సయిటింగ్‌గా వున్నది. ఇతడెక్కడి మనిషి? చాలా వింతగా వున్నది అతడి ప్రవర్తన. రేపు ఏడువేల మూడు వందలు యిస్తానంటున్నాడు... తనని ఎక్కడికో రమ్మనబోతుంటాడు. ఎక్కడికై వుంటుంది? మెల్లగా మాటలు చెప్పి తీసుకు వెళ్లి పిచ్చితనంతో తన గొంతు పిసికి చంపేయడు గదా!

ఆలోచనల నడుమ అస్తవ్యస్తమయిన మనస్సుతో– తన స్టేజీలో బస్సుదిగి అక్కడకు ఫర్లాంగు దూరంలో వున్న యింటికి నడుచుకుంటూ వెళ్ళింది.

తల్లి బెడ్ రూంలో లైటు వెలగటం లేదు. పోషణ లేక పిచ్చి మొక్కలతో నిండిన ఆవరణ దాటి ముఖద్వారం దగ్గర నిలబడి కాలింగ్ బెల్ నొక్కింది మేనక.

పని మనిషి తలుపు తీసింది.

"అమ్మ రాలేదా?"

"లేదమ్మా! ఇప్పుడే ఫోను చేశారు... ఒక గంటలో వస్తానన్నారు... మీరు వస్తే అన్నం తిని చదువుకోమన్నారు!"

"మేనక తన గదిలోకి వెళ్ళింది. మనస్సంతా కలవరపాటుతో వున్నది. తన సిమ్లా ప్రయాణానికి డబ్బయితే అందుబాటులోకి వస్తున్నది కాని, సచ్చిదానందమూర్తి ప్రవర్తనే అర్థం గాకుండా వున్నది. ఎందుకిస్తున్నాడు తన కింత డబ్బు? తననుండి ఆయన ఏమి ఆశిస్తున్నాడు? తననేదైనా రొంపిలోకి దింపే ప్రయత్నంలో వున్నాడా?

చీర విప్పేసి మాక్సీ వేసుకున్నది. పొడువైన జడను చుట్టగాచుట్టుకున్నది. కాళ్ళూ చేతులూ కడుక్కువచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నది.

మేనక అన్నం తినడం పూర్తయ్యేటప్పటికి తల్లి వచ్చింది.

"పొద్దున్నే నాకు బయటకు వెళ్ళే పని వున్నది... రాత్రి వచ్చేటప్పటికి ఆలస్యం గూడా అవ్వవచ్చు... నీకు రేపు కాలేజీ లేదు గదా... ఆ పాత బీరువా తెరిచి క్రింద సొరుగుల తాళం చెవులు వెతికి- అందులో పొలం డాక్యుమెంట్స్ వుండాలి... తీసి బయట పెట్టు! సిమ్లా సిమ్లా అని ఏడుస్తున్నావు గదా... పొలం అమ్మకానికి పెట్టాను ... డబ్బు అందగానే నీకు పదివేలిస్తాను!" అని తన బెడ్‌రూంలోకి వెళ్ళిపోతూ, "ఆ కాగితాలు ఎక్కడున్నయ్యో ఏమిటో... ఆ బీరువా తెరిచి పదిహేను సంవత్సరాలపైనే అయి వుంటుంది!" గొణుక్కున్నది.

"నువ్వు చూచుకో గూడదటమ్మా!" విసుగ్గా అన్నది మేనక తల్లితో, "నాకు నువ్వేం డబ్బు ఇవ్వనక్ఖరలేదులే... ఓ పెద్దమనిషి ఇస్తానని ప్రామిస్ చేశాడు!"

- సచ్చిదానందమూర్తి తన విషయం తల్లికి చెప్పమన్న సంగతి గుర్తుకు రాగా ఇదే దానికి మంచి తరుణంలా భావించి- తల్లంటే నిర్లక్ష్యానికి తోడు కాస్త హుషారును గూడా జోడించి అన్నది.

"ఎవరా పెద్దమనిషి?" నుదురు చిట్లించి అడిగింది తల్లి.

"నాకు తండ్రిలాంటి వాడు!" ఆయన పేరు చెప్పటం దండగనిపించింది. తనకు మేనక అని పెట్టినట్లే ఆయనకు సచ్చిదానందమూర్తి అని పెట్టుకొని వుంటాడు!

"ఏ మగవాడినీ తొందరపడి నమ్మబోకు... తండ్రిగాని, భర్తగాని... నీనుండి ఆయన ఏం పొందాలని ఆశించి అంత డబ్బిస్తున్నాడో కాస్త తెలివిగా ప్రవర్తించి తెలుసుకో... లేకపోతే ఊబిలో ఇరుక్కుపోయి గిలగిలలాడి చస్తావు తరువాత!"

"అలాంటి వాడు కాదులే ఆయన!"- మొండిగా అన్నది మేనక.

"సరే! నీ ఖర్మ... అనుభవించు... కానీ రేపు ఆ కాగితాలు మాత్రం తీసి పెట్టు... నాకూ డబ్బు కావాలి! ఎల్లుండి పొద్దున్నే పొలం కొనేవాళ్ళు వస్తున్నారు, ఎడ్వాన్సు ఇచ్చేటందుకు!" ఆమె విసురుగా వెళ్ళిపోయింది.

అలా వెళుతున్న తల్లివంక అసహ్యంగా చూచింది మేనక!

* * *

సాయంత్రం ఆరు గంటలయింది. ఇవ్వాళ ఆఖరి రోజు. అతడిని చూడటానికే ఆఖరి రోజు గాకుండా- పార్కుల వెంట తిరగటానికీ తను దీనిని ఆఖరి రోజు చేయాలి!

పార్కులో కాలు పెడుతూనే ఆ పొద వంక చూచింది.

ఆయన అక్కడ కూర్చుని వున్నాడు!

అయిదు నిముషాలు ఆలస్యంగా వెళ్ళి ఆయన ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలనిపించింది క్షణం. కానీ అతడిస్తానన్న డబ్బు అతడితో ఆటలాడటానికి సుముఖత చూపనీయలేదు. అంత మొత్తానికి తిరిగి తల్లి దగ్గర చేయి జాపవలసి వస్తుంది. ఆమె ఇచ్చే లెక్చర్లను ఓపిగ్గా వినాలి బుర్రపాడు చేసుకుంటూ.

సరాసరి ఆ పొద దగ్గరకు వెళ్ళి వినయంగా, "నమస్కారమండీ!" అన్నది. ఆయన తనని కూతురిగా భావిస్తున్నప్పుడు అభివాదం చేయడంలో అసంబద్ధత లేదనిపించింది.

"ఓకే! కూచోరా! మీ అమ్మ చెప్పిన నీతి బోధలు విన్నావా రాత్రి! అయినా నువ్వు నన్ను సపోర్టు చేస్తావని నాకు తెలుసు!"

బిక్క మొహమేసుకొని ఆయన వంకే చూస్తూ వుండిపోయింది.

"ఇవ్వాళ ఆఖరి రోజు గదా! ఓ అయిదు నిముషాలు ఆలస్యంగా వెళ్ళి ఈ పిచ్చివాడిని ఏడిపిద్దామని- ప్లాను వేస్తావేమోనని భయపడ్డానురా బంగారం! రా- కూర్చో!" అన్నాడు.

మేనక వళ్ళంతా చెమటలు పట్ట సాగినయి అతడి మాటలు వింటుంటే. గొంతు తడారి పోతున్నది.

ఏం మనిషి ఇతడు? ఎదుటి మనిషి మనస్సును అంత స్పష్టంగా చదవ గలుగుతున్నాడూ అంటే అతడికి అతీంద్రియ శక్తులు గాని లేవు గదా! అతడి మేధస్సుకు శిరస్సు వంచి పాదాభివందనం చేయాలనిపించింది.

"అమ్మ ఏంవన్నది?"

"మీరు ఏం ఆశించి నాకు ఇంత డబ్బు ఇస్తున్నారో కాస్త తెలివిగా ప్రవర్తించి తెలుసుకోమన్నది!" స్ఫటికమంత స్వచ్ఛంగా నిజాన్ని చెప్పింది.

"ఓకే... ఓకే... నీ తల్లి నీకు చెప్పగలిగే మాటలు అవే కాబట్టి వింతలేదు... కానీ అసలు పార్కుకు ఎందుకు వెళుతున్నావని మొహం వాచేలా చివాట్లు పెడుతుందేమోనని భయపడ్డాను!"

మేనక కసిగా తల్లి రూపాన్ని కళ్ళముందు నిలబెట్టుకున్నది. ఆవిడగారు తనని ఆ మాట అంటే ఎలా రిటార్ట్ ఇవ్వాలో తనకు బాగా తెలుసు. తనకు తెలుసని ఆమెకూ తెలుసు. తను ఎప్పుడు ఏం చేసినా నసుగుతుందే తప్ప- గట్టిగా మందలించే శక్తి ఆమెకు లేదు!

సచ్చిదానందమూర్తి మేనకకు చాలా పక్కకు జరిగాడు. ఆమెను అనుకున్నంత దగ్గరిగా జరిగాడు.

తన శరీరం ఆయన శరీరానికి తగులుతుండగా ఏవో శక్తివంతమైన విద్యుత్ తరంగాలు ఆమె శరీరాన్ని చుట్టి వేస్తున్నట్లనిపించింది. తెలియని మగతలోకి వెళ్ళిపోతున్నట్లుగా భావించింది. ఎలాంటి భయమూ కలగటం లేదు. ఆదుర్దా కలగటం లేదు. ఆవేశం కలగటం లేదు. ప్రశాంతత మనస్సును అక్సిజన్‌లా చుట్టి వేస్తోంది.

మేనక భుజం మీద రెండు చేతులూ వేసి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు సచ్చిదానందమూర్తి.

మేనక తన నాసికను కుడిచేతి వేళ్ళతో రుద్దుకున్నది- సుగంధ భరితమైన వాసన వస్తుండగా, ఆయన వంటి నిండా ఏదో ఘాటైన పర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకున్నట్లే వున్నది.

"ఈలాంటి అద్భుతమైన, అతీతమైన సన్నివేశం స్వర్గంలోగాని లభించదురా నాన్నా! నీ శరీరంలోని ఒక్క సన్నని నరమైనా నన్ను తండ్రిగా భావిస్తూ ఆలింగనం చేసుకోమని నిన్ను ప్రోత్సహించటం లేదురా కన్నా... నిన్ను పొదివి పట్టుకొని నా గుండెలకు హత్తుకోలేకపోయిన ఈ సంవత్సరాలన్నీ నాకు యుగాలేకదా!" అతడి నేత్రాలు జలిస్తున్నాయి. అతడి శరీరం వణుకుతోంది. అతడి కనురెప్పలు వాలిపోతున్నాయి. అతడి పలచని జుట్టు నిక్కబొడుచుకొని మేనక చెంపలకు సూదుల్లా పొడుచుకుంటోంది. అతడు ఆవేశంతో ఊగిపోతున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నారో వాళ్ళకే తెలియదు. పైన ఆకాశాన్ని నల్లటి మబ్బులు క్రమ్మివేసిన విషయమే తెలియదు. బలమైన చల్లటి గాలి తమని ఊపేస్తున్నదనే విషయమే వాళ్ళకు తెలియదు. వాన చినుకులు కత్తుల్లా పైనుంచి దూసుకు వచ్చి వాళ్ళ శరీరంలోకి దూసుకుపోతుంటే ముందుగా మేనకే కళ్ళు తెరిచింది తెలివి తెచ్చుకొని. శరీరాన్ని కమ్మిన మాయనుండి బయటపడి ఉలిక్కి పడుతూ నలువైపులా చూచింది.

చీకటి. చుట్టుపక్కలంతా కరెంటు పోయినట్లున్నది. భయంకరంగా వున్నదా చీకటి. పైనుండి వానచినుకులు...

పక్కనున్న అతడిలో చలనమే లేదు. ఇంకా అతడు ఆమెను పట్టుకొని బిగుసుకు కూర్చునే వున్నాడు, "నాన్నా! బంగారూ!" అంటూ.

మేనకకు ఆ చీకటిలో అతడి చేష్ట భయం కలిగిస్తోంది. "ఏమండీ... ఏమండీ!" అంటూ అతడి భుజాలు పట్టుకు ఊపింది వడివడిగా.

దీపాలన్నీ ఒక్కసారిగా వెలిగినయి చీకటిని ఛేదిస్తున్నట్లుగా.

ఆమె కలవరపాటుతో తలెత్తి గడియారం వంక చూచింది. సరిగ్గా ఏడు గంటలు చూపిస్తున్నది. అతడూ మైకం వదిలినట్లుగా కళ్ళు తెరిచాడు.

"ఆత్మీయత నన్ను వివశుణ్ణి చేసిందిరా... ఈరోజున నేను నీకిస్తానన్న డబ్బు ఇవ్వకుండానే ఈ గంట గడిపేశాను కదూ! మైగాడ్... ఎంత అవివేకినయ్యాను! నీ ముందు నేనెంత బలహీనుడనయ్యానో గ్రహించావా?" అంటూనే జేబులో నుంచి కవరు తీసి ఆమె కిస్తూ, "లెక్క పెట్టుకో!" అన్నాడు.

"అక్కర్లేదు! ఏ కూతురు తండ్రిని అనుమానించగూడదు!" ఆమె గుండె లోతుల్లోనుంచి వచ్చిన ఆమాటలకు అతడు చలించాడు.

చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాడు. అలా పట్టుకున్న వానకు తడిసిన ఆ చేయి మంచులా చల్లగావున్నది. అతడి కళ్ళల్లోనుంచి మంచు నురుగులా బయటకు వచ్చి తనని చుట్టేస్తున్నట్లే వున్నది. కలవరపడింది మేనక.

"మీరెవరు?" బిగుసుకు పోతూ, గిటక బారిపోతున్న పళ్ళను బలవంతాన కదిలిస్తూ అన్నది.

"నేను నేనే... నువ్వు నా కూతురివే!" అన్నాడు అతను, నోటిని పళ్ళన్నీ కనబడేలా తెరిచి.

అతడిని చూడలేక భయంతో కళ్ళు మూసుకొని తలెత్తింది.

"వాన పెద్దదయ్యేలా వున్నది పదరా! ఆటో ఎక్కేద్దాం!" అంటూ ఆమె చేతినిపట్టుకొని ఈడ్చుకు వెళుతున్నట్లుగా రోడ్డు మీదకు తీసుకు వెళ్ళాడు. అక్కడున్న ఆటోలోకి నెట్టేస్తూ, "పోనీయ్!" అన్నాడు.

మేనక అతడిప్రవర్తనకు గజగజా వణికిపోతోంది. ఆపైన వాన చినుకులకు తడిసి శరీరానికి అతుక్కుపోతున్న చీర.

ఆటో ముందుకు దూసుకు పోతున్నది. వీధి దీపాల గుడ్డి వెలుగులో అతి రయంగా వెళ్ళిపోతున్నది. ఎక్కడకు తీసుకు వెళుతున్నాడు తనని?

ఆటో అతనూ అతడి మనిషేనా? మేను కంపించించి మేనకకు. అందులోనుంచి దూకేస్తే? ఆటో వెళుతున్న వేగంలో మేనకకు వళ్ళు తెలియటం లేదు. బుర్ర పనిచేయటం లేదు. దూకితే తను చచ్చిపోవటం మాత్రం ఖాయం!

"ఆపు!" గొంతు తెరిచింది. పెద్దగా అరిచాననుకున్నది. కాని నోరు పెగల్లేదు.

అతడు ఆటో డ్రైవర్ భుజం తట్టి 'ఆపు' అన్నట్లుగా సైగ చేశాడు. అప్పుడు ఆటో ఆగింది.

"దిగు!" అంటూనే మేనక చేయి పట్టుకొని దింపాడు. ఇద్దరూ పెద్ద గేటుదాటి ఆ ఆవరణలోకి వెళ్ళారు. తలెత్తి నలుపైపులా నిశితంగా చూచింది గుండె బిగపట్టుకొని– అది రామకృష్ణ మఠం!

అతడు చేయి పట్టుకునే వడివడిగా లోపలకు తీసుకు వెళ్ళాడు పుస్తకాల విక్రయశాలలోకి. అందులో కాలు పెడుతూనే పుస్తకాల స్టాండు దగ్గరకు వెళ్ళి ఒక పుస్తకం తీసుకొని ఆమె చేతిలో పెట్టాడు.

"ఈ పుస్తకం నువ్వు ఖచ్చితంగా చదవాలిరా. స్వామి బుధానంద రాసిన– ది మైండ్ ఎండ్ ఇట్స్ కంట్రోల్– నీ మనస్సు నీ అధీనంలో లేకపోతే నీ సమాజం నీ ఆధీనంలో ఉండదు... నీ సమాజం నీ అదుపాజ్ఞలలో లేకపోతే వేల సంవత్సరాల విలువైన నీ దేశ సంస్కృతి నేలపాలయి పోతుందిరా, నాన్నా!"

మేనక సచ్చిదానందమూర్తి వంకే చూస్తున్నది ప్రశాంతంగా– అతడి ముఖం ఆ క్షణాన చాలా నిర్మలంగా వున్నది. స్ఫటికంలా మెరుస్తున్నది. ఏదో విజయం సాధించినట్లే వున్నది అతడి పెదాల మీద చిరు దరహాసం.

"ఊరికినే వచ్చిన పుస్తకాన్ని మనం మనసారా చదవలేంరా... నువ్వే డబ్బులివ్వు!" అన్నాడు.

ఆ మాటకు, అతడి చేతిలోని మరబొమ్మలా, వ్యానిటీ తెరిచింది. యిరవై రూపాయల నోటు తీసి ఇచ్చింది.

కౌంటర్‌లో అతను బిల్లుని, పుస్తకాన్ని కవరులోపెట్టి మిగిలిన డబ్బుతోసహా యిచ్చాడు. ఆమె వాటిని వ్యానిటీలో పడేసింది.

బయటకు వచ్చారు ఇద్దరూ. గేటు ఇంకొక పదడుగులు దూరంలో వున్నదనగా అతడు ఆమె చేయి పట్టుకొని పైకెత్తి ముంజేతి వంకే చూస్తూ, "నా ప్రాణమా! నిన్ను భారతీయ సిద్ధాంతాలకు నిర్వచనంలా రూపొందించాలనేదే నా కోరిక... నా ఆశ... నన్ను నిరుత్సాహపరచబోకురా, నాన్నా!" అంటూ చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు ఆ ముంజేతి మీద.

అవాక్కయింది మేనక అతడి చేష్టకు.

"బై బేబీ బై!" చేతులూపుతూ, గేటుదాటి ముందుకు పోయి అక్కడే వున్న తాము దిగిన ఆటోలో ఎక్కి కూర్చొని, "పోనీయ్!" అన్నాడు.

ఆ ఆటో వెళ్ళిన తరువాత గాని మేనకకు పూర్తిగా స్పృహ రాలేదు. అలా వచ్చిం తరువాత గానీ తెలుసుకోలేక పోయింది అతడు వెళ్ళిపోయాడు అని!

* * *

ఆటో దిగి ఇంట్లో కాలు పెడుతుండగానే తల్లి హాల్లో కూర్చొని కనబడింది. టీపాయ్ మీద సీసాలు పెట్టుకొని, గ్లాసుల్లో నింపుకొని త్రాగుతున్నది.

ఈ రోజున ఆమెను తీసుకు వెళ్ళిన మనిషి ఎక్కువ డబ్బయినా యిచ్చి వుండాలి–లేదా మోసమయినా చేసి వుండాలి... అందుకే సీసాలు ముందు పెట్టుకున్నది!

"ఏమే! పొలం కాగితాలు దొరికినయ్యా?"

గతుక్కుమన్నది మేనక. లేచినప్పటి నుండి సచ్చితానందమూర్తి ఆలోచనలతోటే మనస్సంతా నిండి వుండటంతో తల్లి చెప్పిన విషయం మరిచిపోయింది.

"చూస్తానులే!" తన గదిలోకి వెళుతూనే వ్యానిటీబ్యాగ్ తీసి మంచంమీద పడేసింది. చకచకా మాక్సీలోకి మారి పోయింది. 'త్రాగుతూ కూర్చోకపోతే రాగానే వెతుక్కోగూడదూ!' అనుకున్నది కసిగా.

ఫ్రెషప్ అయి తల్లి దగ్గరకు వెళ్ళి, "తాళం చెవులు ఎక్కడున్నయి?" అన్నది చికాగ్గా.

"వెతుకు!" కసురుకుంటున్నట్లుగా అన్నది ఆమె... అగ్నిలో మరింత ఆజ్యం పోస్తున్నట్లుగా గ్లాసెత్తి గడగడా త్రాగేసింది. "ఆ బీరువా నిండా ఆ దరిద్రపు మనిషి సామాన్లే వున్నాయి! ఎప్పుడూ నేను తెరవలేదు!"

చురుగ్గా చూచింది తల్లి వంక ఒకసారి మేనక- ఆమె ఎవరిని గురించి ఆ మాట అంటున్నదో అర్థమవ్వగా!

విసురుగా బీరువా వున్న గదిలోకి వెళ్ళి ఆ బీరువా తలుపు తీసింది. ముక్క వాసన. ముఖం చిట్లించుకుంటూ క్యాష్ బాక్స్ తెరిచింది. మూలమూలలా వెతికింది. క్రింద సొరుగుల తాళం చెవులు దొరకటంతో వాటిని తెరిచింది. ఏవేవో కాగితాలు. ఎక్కడా డాక్యుమెంట్సు కనబడలేదు. సొరుగులు బయటకు లాగి క్రింద పెట్టింది. సీక్రెట్ లాకర్ రేకు లాగింది.

తన తండ్రి ఆమెకేం అన్యాయం చేశాడో తెలియదు గాని- ఎప్పుడూ ఆయనంటే ద్వేషమే కుమ్మరిస్తుంటుంది. ఇంటి మొత్తం మీద ఎక్కడా ఆయన ఫొటోగూడా లేదు- అంతదాకా ఎందుకు ఇంతవరకూ తనకే తెలియదు ఆయన ఎలా వుంటాడో!

బీరువాలో క్రిందంతా కాగితాలు పరిచివున్నాయి. ఒక్కొక్కటి తీసి చూస్తూ పక్కన పెట్టింది. వాటి క్రిందగా డాక్యుమెంట్లున్న కవరు కనబడడంతో కాగితాలు పక్కకు నెట్టి దాన్ని తీసింది. దాని క్రిందగా ఫ్రేము లేని పెద్ద ఫొటో ఒకటి వున్నది!

దాన్ని చటుక్కున అందుకున్నది మేనక.

ఆ ఫొటోను చూస్తూనే ఆమె బిగుసుకుపోయింది. అందులో వయస్సులో వున్న తన తల్లి పక్కన తన తండ్రి... తన తండ్రి... అతడు తన తండ్రి... అతడు... అతడు... సచ్చిదానందమూర్తి... పెళ్ళి నాటి ఫొటో!

"అమ్మా!" పెద్దగా అరిచింది. ఆ ఫొటో పట్టుకొని హాల్లోకి వస్తూ- "ఈయనేనా మా నాన్న?"

ఆమె త్రాగిన మైకంలోనే కళ్ళు చికిలించి దాని వంక చూస్తూ, పరమ అసహ్యంగా ముఖం పెట్టి, "ఛీ! అవతల పారేయ్!" అన్నది.

"నేను అడిగిన దానికి సమాధానం చెప్పు!" కఠినంగా అన్నది తల్లి వంక చూస్తూ మేనక.

"ఆఁ... ఆయనేలే!" విసురుగా అంటూ గ్లాసు అందుకున్నది- ఆమె.

"నేను ఆయన్ను చూచాను!"

ఉలిక్కిపడ్డట్లుగా ఆమె కూతురివంక చూచింది.

"నువ్వు చూడడమేమిటి... ఆయన చచ్చే యిరవయి యేళ్ళయితే!"

"లేదమ్మా! ఆయన బ్రతికే వున్నారు... సాయంత్రం పూట కలిసి ఒకాయన నాకు డబ్బు యిస్తానన్నాడంటినే- ఆయనే!"

"నీ మొహం... నా చేతులతో స్వయంగా నేనే చంపేశాను... సంఘం... సంస్కృతి అంటూ వెధవ కబుర్లతో నన్ను పంజరంలో చిలకలా చేయాలనుకున్నాడు... భరించలేక ఇంత విషంపెట్టి వదిలించుకొని, దగ్గరుండి మరీ నేనే దహనం చేయించాను... ఎవర్ని చూచి ఎవరనుకున్నావో!" అన్నది నవ్వుతూ.

"కాదు ఆయనే... అయనే! ఇట్లాగే వున్నాడు!"

తల్లి మరోసారి పకపకా నవ్వింది. "ఇట్లాగే వుండడమేమిటి... ఈ పాటికి యాభై ఏళ్ళు వచ్చి వుంటాయి... ప్రతి దానికీ ఓకే... ఓకే అంటూ తల ఎగరేస్తూ నా మాట ఒక్కటీ నెగ్గనిచ్చేవాడు కాదు... కాల్చుకు తిన్నాడు బ్రతికున్న నాలుగు రోజులూ!"

"ఆయన పేరేమిటన్నావ్?" అన్నది తల్లి ముందుకు మరో అడుగు వేసి.

"ఆనందమూర్తిలే... పెద్ద గొప్పగా అందరి ముందూ చెప్పుకుంటుండే వాడు... సత్ చిత్ ఆనందమూర్తిని- సచ్చిదానందమూర్తిని అంటూ! ఎప్పుడూ దేవుళ్ళూ... పూజలూ... పుస్తకాలు తప్పా మరో ధ్యాసే లేదు!"

మేనక కళ్ళు తిరుగుతున్నయి. వళ్ళు జలదరిస్తోంది. మైకం కమ్ముతోంది... ఆయనే ఆయనే... శరీరం తూలిపోతున్నది... తనూ... ఇల్లు... తల్లీ... అంతా గిరిగిరా తిరిగిపోతున్నారు.

ఫొటోలో వున్న ఆయన నవ్వుతున్నట్లే వున్నాడు. తననే పట్టుకొని, "నేనేరా కన్నా!" అంటున్నట్లే వున్నాడు.

తన గదిలోకి ఆ ఫొటోను తీసుకు పరుగెత్తింది. మంచం మీద వున్న వ్యానిటీ బ్యాగ్‌ను అందుకొని తెరిచింది ఆయనిచ్చిన కవరు కోసం- దాన్ని తల్లి ముందు పెట్టి నిరూపించాలి అన్నట్లుగా. ఆ కవరు కనబడలేదు. ఆమె గుండె ఝల్లు మన్నది. వడివడిగా బీరువా తెరిచి ఆ పై అరలో పేపరు క్రింద తన చీరల వెనగ్గాపెట్టిన రెండు వేల ఏడొందల కోసం చూచింది- అవీ లేవు! డబ్బంతా ఏమైందీ...?"

అంటే-?

మళ్ళీ వ్యానిటీ బ్యాగ్ అందుకున్నది. అందులో ఆయన తన చేత డబ్బులిప్పించి కొనిపించిన పుస్తకం మాత్రం వున్నది– 'ది మైండ్ అండ్ ఇట్స్ కంట్రోల్'

కెవ్వున అరిచింది మేనక మంచం మీదకు వాలిపోతూ.

తరువాత పది నిముషాలలోనే తల్లి కేకలేస్తూ, ఊగిపోతూ మేనక గదిలోకి వచ్చింది. "ఏమైందే... ఇంతకీ ఆ కాగితాలు దొరికినయ్యా లేవా?"

మగతగా కళ్ళు తెరిచింది మేనక అతి కష్టం మీద.

ఎదురుగ్గా నోరు తెరుచుకొని రక్కసిలా నిలబడివున్న తల్లి.

"మా నాన్నను చంపానని సంబరపడిపోతున్నావు కదూ– ఆయన చావలేదు!"

"ఛత్! నోర్ముయ్... ఆయన ఒళ్ళో పడుకొని మాటలు చెబుతూ ఈ చేతులతోటే విషం కలిపిన పాలు త్రాగించాను!"

పక్కనున్న టేబుల్ మీద పేపరువెయిట్ తీసుకొని తల్లి మోకాలు 'ఫట్' మని విరిగేలా విసురుగా కొట్టింది.

ఆమె కుప్పలా కూలబడిపోతూ, "చచ్చాన్రా దేవుడా!" అని అరిచింది.

"ఇక కదలకుండా పడివుండు... కదిలావో రెండో కాలు గూడా విరక్కొడతాను!" కళ్ళ వెంట నిప్పులు కురిపిస్తూ అన్నది మేనక.

తనని తాను నిగ్రహించుకుంటూ– తన తండ్రి తన చేత కొనిపించిన పుస్తకాన్ని– ఆయన్నే పట్టుకున్నంత ఆప్యాయంగా పట్టుకొని గుండెలకు హత్తుకున్నది.

మరుక్షణంలోనే ఆమె హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చినదానిలా రోడ్డు మీదకు పరుగెత్తింది ఆ మ్యాక్సీ మీదే. గేటు దాటుతూనే కనబడిన ఆటోను ఆపి ఎక్కి కూర్చొని ఎటు పోవాలో చెప్పింది.

ఆమె పళ్ళు సలసలా కాగిపోతున్నది. కుతకుతలాడి పోతున్నది. ఉద్వేగంతో గుండె ఎగిరెగిరి పడుతోంది.

తను సాయంత్రం పూట వచ్చి తండ్రిని కలుస్తుండే పార్కు వచ్చింది. మొదటి రోజున ఆయన చెప్పిన ఆ యింటి గుర్తులని మననం చేసుకోసాగింది.

'ముందుకు వెళ్ళి- ఎడం చేతి వైపు రెండో వీధిలోకి తిరిగితే కుడివైపు నాలుగో యిల్లే- నడక దూరం' అన్న 'ఆయన మాటలు గుర్తుకు వచ్చినయి.

ఆటో అతను ఆమె చెప్పినట్లుగా తీసుకు వెళుతున్నాడు.

"ఆపు!" అన్నది సందు తిరిగిన తరువాత కుడివైపు ఇళ్ళను లెక్కిస్తూ- నాలుగో ఇల్లు రాగానే ఉత్సాహంగా, ఆటోలో నుంచి క్రిందకు దూకుతున్నట్లుగా దిగింది.

ఆయింటి తలుపులు మూసి వున్నాయి. కిటికీ తలుపులు మూసి వున్నాయి. ఏ గదిలోనూ దీపం వెలగడంలేదు. గేటు తాళం వేసి వున్నది.

అయోమయంగా అటూ యిటూ చూచింది. తన దగ్గర నుంచి వెళ్ళిపోయిన తరువాత ఇంకా ఇంటికి రాలేదా? భార్య లేదన్నాడు గదా... భోజనానికి హోటల్‌కు వెళ్ళి వుంటాడా?

ఆలోచనలతో సతమతమవుతుండగా పక్కింట్లోనుంచి ఎవరో ఒక ముసలాయన బయటకు వచ్చాడు.

ఆయన వైపుకు రెండడుగులు వేసి, "ఏమండీ! ఈ ఇంట్లో వాళ్ళు ఎప్పుడొస్తారో తెలుసా అండీ!" అని అడిగింది ఆయన్ను.

ఆయన మేనక వంక విచిత్రంగా చూచాడు.

"ఆ యింట్లో ఎవ్వరూ వుండరు గదా... అసలు మీకెవరు కావాలి?"

"సచ్చిదానందమూర్తిగారి ఇల్లు కాదా అది!"

ఆయన మేనక వంక కళ్ళు చికిలించి చూచాడు. "ఆయన పోయి చాలా సంవత్సరాలయింది గదండీ...వాళ్ళకు ఈ ఊళ్ళోనే మరో ఇల్లు వున్నది... ఆయన పోగానే ఆయన భార్య దీన్ని అమ్మేసి ఇక్కడనుంచి వెళ్ళిపోయింది... తరువాత ఈ ఇల్లు చాలామంది చేతులు మారినా ఎవ్వరూ వుండలేక పోవడంతో పాడుబడి నివాసయోగ్యం గాకుండా పోయింది ... ఆయింటి తాళాలు తెరిచి ఎన్ని సంవత్సరాలయిందో!" అన్నాడు ఆయన మేనకనే కన్నార్పకుండా భయం భయంగా చూస్తూ!

* * *

*(తానా వారి తెలుగు పలుకు- 2003 మరియు రచన: ఆగస్టు, 2003)*